# నిచ్చెన

కొత్త పట్నం చాలా చిన్న వూరు. ఆ వూరికి ఎక్కువగా కార్లు రావు, రోడ్డు రవాణా సంస్థవారి బస్సులు రోజుకో నాలుగు, ప్రైవేటు బస్సులు కొన్ని నడుస్తుంటాయి. ఎప్పుడో పెళ్ళి పార్టీల వారివి ఒకటో రెండో టాక్సీలు, రాజకీయ నాయకులు వచ్చినప్పుడు కార్లు, వ్యాన్లు వస్తుంటాయి.

ఇల్లాంటి సందర్భంలో కనకం యింటి ముందు నుంచి పొడుగాటి ఎర్రని కారు మెత్తగా జారిపోతూ వచ్చింది. పశువులు అడ్డం రాగా కొంత స్పీడు తగ్గించి, మళ్లీ ఎక్కించి, చప్పుడే లేనట్లు, మెరుస్తున్న వెనుక లైట్లతో, కారు ముందుకు పోనిచ్చాడు ఆ డ్రైవరు. ఆ పది సెకన్ల వ్యవధిలోను వళ్ళంతా కళ్లు చేసుకున్నట్లు చూసేస్తున్న కనకానికి కారు, కారు లోపలి మనిషి కూడా చక్కగా కనబడ్డారు. ఆ సమయంలో కనకం మల్లెపూలు మాల కడుతున్నది. చేయి ఆగిపోయింది. చూపు నిలిచి పోయింది. ఆ కారులోని ఆమె అంబుజం. ఓయమ్మో అంబుజమే. చిన్నప్పుడు బళ్లో తన పక్కన కూచుని, లెక్కల్లో సున్నాలు తెచ్చుకుంటూ, మాస్టారి చేత మొట్టికాయలు తిన్న అంబుజం! మొండి బారిన ఆపిల్ల, ఫెయిలయింది కూడా. వాళ్ల నాన్న చేగోడీలు అమ్మేవాడు. 'కర్‌కర్! కర్‌కర్!' అంటూ అరుస్తూ, తన చేగోడీల బోలుతనాన్ని, గట్టితనాన్ని గురించి చాటిస్తూ తిరిగిన బంగారయ్య... ముచ్చట ముడి, చేతికి మురుగు, నుదుటి మీద కుంకుమ... బలేగా అమ్మకాలు చేసే ఆ బంగారయ్య కూతురే అంబుజం.

ఆమె అందమైనది కూడా కాదు. కానీ ఎల్లాగో పెళ్లయిపోయింది. ఆ పెళ్లికి స్నేహితులంతా వెళ్లారు. పక్కనున్న పల్లెటూళ్లోనే ఆమె అత్తవారు. కానీ వాళ్ళాయన సిటీలో ఏదో పనిచేస్తున్నాడని, అక్కడే కాపురం పెట్టారు. ఏదో తమ స్నేహితులందరి లాగానే, మరీ పేదగా కాకుండా, తగు మాత్రం తిండి, బట్టకలిగుంటే చాలును కదా! అంబుజం అల్లాగే వుంటే బాగుండిపోయేది కదా! అల్లా కాక, వున్నట్లుండి అంత దశ అందుకోవడమేమిటి?

కనకం మల్లెపూల మాల కట్టినంతవరకు ఆపేసి, తుంచి తలలో పెట్టేసుకుంది. మిగిలిన పూలతో వున్న పళ్లాన్ని తీసుకొని వెళ్లి సావిట్లో కిటికీలో పెట్టేసింది. పనేమీ లేనట్లు అటూ ఇటూ తిరిగింది. బంగారయ్య ఇల్లు, తమకి మూడో వీధి అవతల. గుడి దాటి పోవాలి. ఆయన యిదివరకు లాగా వీధుల్లో తిరిగి అమ్ముకోకుండా, యింటి దగ్గరే తినుబండారాల దుకాణం పెట్టించాడు కొడుకు చేత. వెళ్ళి అంబుజాన్ని చూస్తేనో? చూడాలి. అసలు దానికి యింత సిరి, హెూదా ఎల్లా వచ్చాయో తేల్చేసుకోవాలి.

ఇంట్లో ఎవరూ లేరు. పనిమనిషి మంగి పెరట్లో గిన్నెలు తోముతోంది. కనకం వాళ్ళాయన వూరికి వెళ్లాడు. పిల్లలిద్దరూ మేనత్త దగ్గరికి సెలవుల్లో రెండు రోజులుందామని వెళ్లారు. "నాకేం భయం? నన్నెవ్వరూ ఎత్తుకుపోరు" అంటూ యింట్లో వంటరిగా వుంటానన్నది మొండిగా కనకం.

ముఖం కడుక్కొని, పౌడరు, బొట్టు, కాటుక దిట్టంగా దిద్దుకుంది. జడవిప్పి అల్లుకొని నలిగిపోకుండా సుతారంగా మల్లెదండ మళ్లీ పెట్టేసుకుంది. బ్రహ్మాండమైన చీరె ఒకటి కట్టుకుంది. మెట్టతామర ఆకు కోసి అందులో మల్లెపూలు పొట్లం కట్టింది. "ఒసే మంగీ! అవన్నీ అల్లా వుంచేయి. తోమినవి గబగబ తొలిచేసి వంటింటి వసారాలో పెట్టు" అని తొందర పెట్టింది. మంగి యజమానురాలు చెప్పినట్లుగానే చేసి, చేతులు తుడుచుకుని వచ్చి ఆమె బ్రహ్మాండమైన చీరె వంక చూసి,"ఏటమ్మగారూ పేరంటానికి వెడుతుండారా?" అన్నది.

కనకానికి అర్థం లేకుండా కోపం వచ్చింది. 'అంటే పెళ్లి, పేరంటం లేకపోతే? నా మొహానికి యిటువంటి చీరె ఎందుకు అంటావా?" అని కొసిరింది. మంగి యిటువంటి మాటలకి చిన్నబుచ్చుకోదు. 'ఎనకాల తలుపులు తీసేసి యిన్నాయి. మరచిపోయి అటే ఎడతారేమో చూసుకోండి' అంటూ చెప్పి వెళ్లిపోయింది.

అది చెప్పబట్టి సరిపోయింది. అనుకుంటూ అన్ని తలుపులూ భద్రంగా వేసి,ముందు తాళం బిగించాక, చెప్పులు వేసుకోలేదని గుర్తుకొచ్చింది. మళ్లీ యింట్లోకి వెళ్లి, మూల పడేసిన చెప్పులు దులిపి తొడుక్కుని అద్దంలో ముఖం చూచుకొని, పూల పొట్లం పట్టుకొని బయలుదేరింది.

అబ్బ, ఈ మట్టి వీధులు బాగుపడేదెప్పుడు? బురద చింది, అంబుజం కారు పాడైపోయి వుంటుంది. ఉన్నట్లుండి ఒక సందేహం కలిగింది కనకానికి. ఆ కారు అంబుజానిదేనా? ఎవరి కారులోనైనా ఎక్కి వచ్చిందా? అబ్బే. ఎంత దర్జాగా సీటుకి జారగిలబడింది. ఎంత వయ్యారంగా చేయి చెంపకానించింది? పరాయి కారులో అది సాధ్యం కాదు.

బంగారయ్య యింటి ఎదురుగా వున్న చెట్టు కింద ఆగి వున్నది కారు. దూరంగానే కాకుండా, దగ్గర్నుంచీ చూసేసింది కనకం. అబ్బ! పడవలాగా వుంది. రెండో, ఐదో, పది లక్షలో... ఎంతుంటుందో? అంబుజం సావిట్లోనే వుంది.

ఒక్క క్షణం ఎవరొచ్చిందీ ఆమెకి తెలియలేదు. మరుక్షణం గుర్తుపట్టి, "కనకం.. రావే! నేనొచ్చానని నీకెల్లా తెలిసింది?" అంటూ కనకాన్ని వాటేసుకుంది. అంబుజం మెడలోని గొలుసులు, నెక్లేసు, చేతులకున్న రాళ్లగాజులు పెద్దజరీ అంచుచీర అన్నీ తనని గుచ్చేస్తోంటే, కనకం తెల్లమొఖంతో పేలవంగా సన్నగా నవ్వింది.

"ఇందాక మా యింటి ముందు నుంచీ మీ కారు వస్తోంటే చూశాను. నిన్ను చూడాలని, మనస్సు ఉండ బట్టలేక వచ్చాను. మా యింట్లో మల్లెపూలు నీకెంతో యిష్టంగా! విచ్చిపోకుండా నీకివ్వాలనిపించింది. ఏమిటి అంబుజం ఎల్లా వున్నావు? " అంటూ గబగబ మాట్లాడింది కనకం.

"బాగానే వున్నాను. ఒకటే పని. క్షణం తీరుబాటు వుండదే! నాన్నకి ఒంట్లో బాగాలేదంటే, పరీక్షలు చేయించడానికి, తీసుకెడదామని వచ్చాను. ఈయనేమో ఈ కొంప వదిలి రాడు. వీలుంటే యిప్పుడు భోజనం కాగానే బయలుదేరుదామనుకొంటున్నాను. మా ఆయనకి మినిష్టరు గారింట్లో డిన్నరు. దానికి లేటు కాకుండా చేరుకోమని గట్టిగా చెప్పారు." అన్నది అంబుజం. ఎంతో మామూలుగా, వాళ్లాయనకి రోజూ మినిష్టరుతోనే డిన్నరు అన్నట్లుగా ఆ మాటలు.

"మీ ఆయనేం చేస్తారేమిటి అంబుజం. పెళ్లిలో సరిగా తెలియలేదు" అన్నది కొంతయినా వారి హోదాకి గల కారణమేమిటో పిలక పట్టి లాగి తెలుసుకుందామని.

అంబుజం నవ్వేసింది. "పెళ్లినాటికి ఏముందే? అంతా ఆ తర్వాతే. బోలెడు బిజినెస్సులు. అబ్బ జనం ప్రవాహంలా వస్తుంటారనుకో యింటికి. మనవే నాలుగు కార్లు, వాకిట్లో కుక్కపిల్లల్లాగా పడుంటాయి. సాయంత్రం ఢిల్లీకో, బొంబాయికో వెళ్లాలి. ఫ్లయిటు టిక్కెట్లు తెచ్చాం. కారు సిద్ధం, పదండి అంటే ఎవరో ఒకరు కాళ్లా వేళ్లా పడుతూనే వుంటారు. సరేలే. దానికేం గాని... నువ్వెలా వున్నావు? పోనీ రాకూడదూ

రాత్రికి నాతో? నిద్రమానేసి కబుర్లు చెప్పుకుందాం. నా ఏ.సి.రూంలో వుంటే ఊటీలో వున్నట్లే హాయి అనుకో. పొద్దున్నే డ్రాప్ చేయిస్తాను. ఎంతా గంట ప్రయాణం!" అన్నది అంబుజం.

అదీ ఒక ఫోజే. కనకం ఎల్లాగూ రాదని తెలుసు. రాత్రికి రాత్రి కారు ప్రయాణాలు చేసేస్తూ, ఫ్రెండ్సుతో కులాసాగా కాలక్షేపాలు చేస్తూ వుండే జాతకమేనా యిది?

కనకం నిట్టూర్చింది. తన వూహకి అందనంత ఎత్తులో వుంది అంబుజం. ఈ పాత యింట్లో అది కూచుంటే, మురికి వాడలో గంధర్వ కాంత వున్నట్లుంది. జిడ్డు పిలక జడల అంబుజమేనా యిది?

"సరేలేవే! మీ ఆయనకి పని వుంటుంది. సహజమే. కానీ నువ్వు అంత బిజీ ఏమిటి అని?" అని ఆరంభించింది కనకం.

అంబుజం, కళ్లనిండా నీళ్లు వచ్చేవరకు పకపక, పడీ పడీ నవ్వి, "పిచ్చి కనకం! ఈ రోజుల్లో మనలాంటి తెలివిగల ఆడాళ్ళు ఫోను మీద, ఫాక్సు ద్వారా, ఇంటర్‌నెట్ ద్వారా ప్రపంచ చక్రాన్నే తిప్పేయవచ్చునే... అంటే నీతి మార్గాల్లోనే సుమా" అన్నది.

కనకం బెంబేలు ముఖం పెట్టి, "ఫోను అంటే తెలుసుకానీ, మిగతావేమిటి.?" అన్నది.

"అదే కదా నేను చెప్పేది? నీకు అర్థం కావు వుండు. నీకు పండు ముక్కలు కోసి పెడతాను" అంటూ కుర్చీ పక్కనే వున్న బుట్టలోంచి కొబ్బరికాయలంత పెద్ద ఆపిల్సు రెండు తీసింది. వాటిని చూడగానే, తన పిల్లలిద్దరూ గుర్తుకొచ్చారు కనకానికి. "అంబుజం! అవి కోయకు నేను తినను" అన్నది. అంబుజం పళ్ళు పక్కన పెట్టి "పోనీలే బొట్టెట్టి యిస్తాలే" అన్నది.

చిన్నప్పుడు బళ్ళో చదువుకున్న అమ్మాయిలు, అబ్బాయిల గురించి ఏవేవో అడిగింది అంబుజం.

"నేను నాలుగైదు నెలలకొకసారి వస్తూనే వుంటాను గానీ ఎక్కువసేపు వుండటం లేదు. అమ్మ కూడా నా దగ్గర వుంది కదా నాన్ననేమో తమ్ముడు, మరదలు చూసుకుంటున్నారు. అది అదేలే. మా మరదలు ఉత్తి పల్లెటూరి రకం. సరిగా భోజనం అమర్చి పెట్టడం చేతకాదు. దీనితో ఆయన అర్థాకలి తిండి. ఆరోగ్యం దెబ్బతిన్నది. నా దగ్గర ఇద్దరు వంటవాళ్ళు వున్నారు. వాళ్ల వంట అమృతమే అనుకో. నలభీములు వాళ్ల బ్రదర్స్ అయివుండాలి.సరే యింక. యిద్దరు పనివాళ్ళు, డ్రైవరు, మాలి, నాన్న ఎంతో సుఖంగా వుండవచ్చును" అని తన గొప్పలు ఎంతో సామాన్యంగా చెప్పేసింది.

కనకానికి యింకేమీ వినాలనిగానీ, మాట్లాడాలని గానీ లేదు. ఇంక అంబుజంతో తను స్నేహం పెట్టుకొన్న కొద్దీ ఆమె ఆకాశంలోకి వెళ్ళిపోతుంటుంది. తను భూమి మీద కాకుండా పాతాళానికి దిగిపోతుంటుంది.

""ఇదుగో దారం. నువ్వు బలే వత్తుగా కడతావే మాల. కట్టిపెట్టవూ? ఈ రాత్రికి మా ఆయనకి మా వూరి పూలు అని ఈ మత్తయిన వాసన చూపించాలి. అంటే డిన్నరు తర్వాత ఆయన ఏ బెంగుళూరో కారులో చెక్కేయకుండా వుంటే!" అన్నది. అబ్బో అబ్బో! ఒక్క వాక్యంలో ఎన్ని విషయాలు చెప్పేసిందో!

కనకం పూలు మాల కడుతోంటే బంగారయ్య వచ్చి పలుకరించాడు. అంబుజం మరదలు వచ్చి వెండి గ్లాసులో కాఫీ యిచ్చింది. ఉన్నట్లుండి బ్లడ్ ప్రెషరు తగ్గిపోయినట్లు నీరసంగా లేచి బయలుదేరింది కనకం. మరదలు బొట్టు భరిణ అందించగా, తనకు తాంబూలంలో రెండు ఆపిలు పళ్ళి పెట్టి, ఒక ప్లాస్టికు కవర్లో వేసి యిచ్చింది అంబుజం.

"ఉండవే. యింటి దగ్గర దింపేస్తాడు" అని డ్రైవరును కేకవేసింది. మంచి తెల్లని బట్టలలో అతగాడెంతగా దర్జాగా వున్నాడని! "వద్దు, వద్దు నాలుగడుగులు వేస్తే యింటి దగ్గర వుంటాను" అని తను చెబుతున్నా వినక, కారు తలుపు తెరిచి, లోపలికి తోసేసింది అంబుజం. దేముడా ఈ తలుపు వేయడం,

తీయడం కూడా రాదే తనకి. అదెంత అవమానం అనుకుంటుండగానే యిల్లు వచ్చేసింది. డ్రైవరు మర్యాదగా తలుపు తెరిచి పట్టుకుని, దింపాక నమస్తే చెప్పి వెళ్లాడు.

తాళం తీసుకుని యింట్లోకి వచ్చి పడ్డాక కనకానికి చుట్టూ చీకటిగా వుంది. లైట్లు అన్నీ వేసినా పోని చీకటి అది. అదృష్టమంటే అల్లా వుండాలి. ఇంద్ర భోగమంటే అదీ! తామెంత, తమ జీవితాలెంత, ఆస్తి పాస్తులెంత? పదిసార్లు తమని హెచ్చవేసినా, అంబుజం వంట వాళ్లకి , పని వాళ్లకి యిచ్చే జీతంతో సరికాదు. కనకం ఆలోచిస్తూ కూచుండి పోయింది.

ఆకలి వేస్తోంది. పొద్దుటి అన్నం వుంటే కంచంలో పడేసుకుని, చారు మజ్జిగ గుమ్మరించుకొని పచ్చడితో తినేసింది. గ్లాసుడు నీళ్లు తాగాక, కొంచెం కంగారు సర్దుకుంది. ఐతే యిది ఆకలి మంట కాదు కదా! తనకంటే అంత ఎత్తు ఎదిగిపోయిన స్నేహితురాలి భాగ్యం చూసిన కడుపు మంట! మర్నాడు సాయంత్రానికి గానీ ఆయన, పిల్లలు యింటికి చేరుకోరు. వాళ్ళతో తనూ వెళ్లివుంటే ఈ ఈర్ష్య యింత చిచ్చులా తనని కాల్చేది కాదు. ఉన్న ఒక్క టేబుల్ ఫ్యాను తిరగలేక, బడబడ చప్పుడు చేస్తోంటే అంత గొడవగానూ వున్న మనస్సుతో నిద్రపోయింది కనకం.

తెల్లవారింది మంగి వచ్చింది. అది పని చేసుకుంటుంటే, అంబుజం గురించి, ఆమె బాల్యం గురించి, ఈనాటి భాగ్యం గురించి చెబుదామా అనుకుంది కనకం. కానీ అల్లా కబుర్లు చెప్పేందుకు ఉత్సాహం రావటం లేదు. మడతమంచం మీద బద్ధకంగా పడుకునే వుంది. "ఏటమ్మగారూ! వంట్లో బాగాలేదా? కాఫీ అయినా తాగారా?" అన్నది మంగి. "బాగానే వుందిలే" అంటూ మూలిగింది కనకం.

మంగి పనులు చాలా చురుగ్గా చేస్తుంది.వాకిలి ఊడ్చేంతలో గిన్నెలు నానబెట్టుకుంటుంది. గిన్నెలు తోమేంతలో నీళ్ల కాగు కింద మంట వేస్తుంది. ఇల్లు చిమ్మేముందే బట్టలకు సబ్బు రాసేసి వుంచుతుంది. బట్టలుతికిన నీళ్ళు జాగ్రత్తగా అరటి చెట్టు కిందకు పోయేటట్లు కాలితో దారి చేస్తుంది. మంగి తెలివి చూసి, కనకం ఒక్కోసారి ఆబ్బురపడుతుంది.

కానీ ఈ వేళ దాని వంకే చూడాలని లేదు.

"అమ్మగోరూ! అయ్యగోరు ఎప్పుడొస్తారండీ?" అన్నది. ఇది చాలా అవసరమైన ప్రశ్నగా అనిపించి, "ఎప్పుడో వస్తారులే, నీకెందుకు?" అని కసిరింది.

"లేదమ్మగోరూ! మా ఆయన సైకిలుషాపులో పాత సైకిలు ఒకటి కొనుక్కుందామని బేరం చేశాడు. ఆ షాపాయన పిల్లలు అయ్యగారి దగ్గర చదువుకుంటున్నారంట. అయ్యగానీ చెబితే, ఓ వందో, యాభయ్యో తగ్గిస్తాడని. అందుకేనమ్మా అడుగుతుంట. లేకుంటే నాకెందుకమ్మా?" అన్నది మంగి.

కనకం లేచి కూచుంది. "ఇంత చిన్న ఉళ్ళో సైకిలు దేనికే మీ ఆయనకి? పట్టుమని పది అడుగులు వేస్తే నాలుగు వీధులూ తిరిగి రావచ్చుగా" అన్నది.

"లేదమ్మా. పొద్దున్న పాలు, కొంచెం పొద్దయినాక కూరగాయలు అమ్మాలని అనుకుంటున్నాడు. కూలి చేసిన డబ్బులు సరిపోతలేవమ్మా!" అన్నది మంగి. ఓహో... యింతింత ప్లాను వేస్తున్నారన్నమాట ఈ చదువురాని వాళ్లు కూడా. డబ్బు సంపాదన గురించి ఆలోచించని మనిషే కనబడ్డం లేదు.

దీనికి యింకా ఎంత పెద్ద బుర్ర వుందో తెలుసుకోవాలన్నట్లు. "మంగీ! దర్జాగా కొత్త సైకిలు కొనుక్కోవే. పాతదెందుకే? రిపేర్లకే ఔతుందేమో బోలెడు?" అన్నది కనకం.

"నిజమేనమ్మా! నేనూ అదే అన్నాను. కానీ పట్నానికెళ్ళినప్పుడు టి.వి. చూసి వచ్చారు అయ్య, కొడుకు. మా చుట్టుపక్కల అందరి గుడిసెల్లోనూ వున్నాయి. మనకి లేదని నా కొడుకు ఒకటే నస మొదలెట్టాడు. సరేలే, మనం సినిమాలైనా కులాసాగా చూసుకోవచ్చునని దానికి కొంత డబ్బు కట్టి

వచ్చాడమ్మా! మీ దగ్గర అప్పుడు దాచుకొన్న నాలుగొందలు కూడా అయ్యనడిగి యిప్పించండమ్మా!" అంటూ తన ఆశలు, ఆకాంక్షలు పథకాలు ఏకరువు పెట్టింది మంగి.

కనకం ఈసడింపుగా "ఇస్తాలే. నేనేమీ కాజేయను. ఇంకేమిటి, సైకిలు మీద సంసారం, షికార్లు, అర్ధరాత్రి దాకా సినిమా డ్యాన్సులు" అన్నది. ఎందుకో వల్లమాలిన తీవ్రత కనకం కంఠంలో. అమ్మగారి మాట ఎంతో అలవాటైన మంగి కూడా కొంచెం వెనక్కి తగ్గినట్లు వూడుస్తున్నది. చీపురు వేగం తగ్గించింది. మాట్లాడకుండా కసువు ఎత్తేసి, బట్టలు ఆరేసి వస్తూ, "అమ్మగోరూ పక్కింటి వాళ్ళు అరటి గెల కోసుకుందామని మన నిచ్చెన అట్టుకెడతామన్నారు. ఎతుక్కోమాకండి" అన్నది.

పెరటివేపు వెళ్లి, అరటి చెట్టు ఎటున్నదీ, గెల ఏవేపు వాలినదీ చూస్తోంటే... నిచ్చెన దానికున్న మెట్లు... ఔను.. ఒకదానికంటే ఒకటి ఎత్తుగా వున్న మెట్లు... పైపైకి పోతోంటే.. ఒకదానికంటే ఒకటి కిందుగా వున్న మెట్లు... కిందకు దింపుతాయి అని తోచింది కనకానికి.

తను అంబుజం వంక పైకి చూసి, చూసి మెడ విరిచేసుకుంటున్నది. కానీ అట్టడుగున వున్న మంగి ఒక్క మెట్టు ఎక్కుతానంటే, ఆమేదో దురాశగా, ఆబగా... పేరాశగా వుందని అనుకొంటూ ఈసడించింది. వెటకారంగా మాట్లాడింది.

ఆశ, కల, తృప్తి అనే మూడు మాటలకు జీవితంలో చాలా అర్థమున్నది. బయటకు వెళ్లి, "మంగీ, సాయంత్రం తొందరగా వచ్చేయి. నీ డబ్బు నీకిస్తాను" అంటూ కేకేసింది కనకం. మంగి సంతోషంగా నవ్వింది.

**(ఆకాశవాణి హైదరాబాద్ కేంద్ర ప్రసారితం)**

**– నడుస్తున్న చరిత్ర, జనవరి 2000**